రాజ్యాంగంపై బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ దాడి

- హిందూత్వ రాష్ట్రమే వాటి లక్ష్యం
- మనువాదాన్ని ఐక్యంగా ప్రతిఘటించాలి
- ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సామాజిక న్యాయం, ఫెడరలిజాన్ని కాపాడుదాం
- సెమినార్‌లో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ పిలుపు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మోడీ సర్కార్ బుల్డోజర్‌ను ఆపే శక్తి ప్రజలకే ఉందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ అన్నారు. 2024లో మళ్లీ బిజెపి గెలిస్తే పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) అమల్లోకి వస్తుందని హెచ్చరించారు. రాజ్యాంగ హక్కులపై కేంద్ర ప్రభుత్వంతోపాటు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ దాడి చేస్తున్నాయని విమర్శించారు. దేశాన్ని, రాజ్యాంగ హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజలందరిపైనా ఉందన్నారు. ప్రజాస్వామ్యాన్ని, లౌకికత్వాన్ని, సామాజిక న్యాయాన్ని, ఫెడరలిజాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. సిపిఎం హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని హుస్సేని ఆలంలో 'రాజ్యాంగ హక్కులు-సవాళ్లు' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బృందాకరత్ హాజరై మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లయ్యిందనీ చెప్పారు. రాజ్యాంగాన్ని విదేశీ శక్తులు నిర్వీర్యం చేయడంలేదని, స్వదేశీ శక్తులైన కేంద్ర ప్రభుత్వంతోపాటు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ దాడి చేస్తున్నాయని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో రాజ్యాంగాన్ని రక్షించాలన్న డిమాండ్ సమాజం నుంచి వస్తున్నదని చెప్పారు. దాన్ని రక్షించేందుకు దేశ ప్రజలంతా అండగా ఉండాలని అన్నారు.

అంబేద్కర్ రాసిన రాజ్యాంగం కాకుండా మనుస్మృతి ఈ దేశ రాజ్యాంగమంటూ ఆర్‌ఎస్‌ఎస్ ప్రకటించిందని గుర్తు చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చాక రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసి మనుస్మృతిని అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. ఈ దేశ సంపద ప్రజలందరిదంటూ రాజ్యాంగం చెప్తుందన్నారు. వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు రాజ్యాంగంలో కొన్ని నిబంధనలు అడ్డుగా ఉన్నాయన్నారు. అందుకే ఈ రాజ్యాంగంపై బిజెపి దాడి చేస్తోందని విమర్శించారు. సిఎఎకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమం సాగిందన్నారు. ఢిల్లీలో షాహీన్‌బాగ్‌తోపాటు హైదరాబాద్‌లోనూ ఉద్యమించారని గుర్తు చేశారు. ఇది ముస్లింలపైనే కాకుండా దేశంపైనా, ప్రజలపైనా జరిగిన దాడి అన్నారు. 2024లో బిజెపి మళ్లీ గెలిస్తే సిఎఎను అమల్లోకి తెస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. హిందూత్వ రాష్ట్రం ఏర్పాటు చేయడమే బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని వ్యాఖ్యానించారు. హిందూ, ముస్లింల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నదని విమర్శించారు. హర్యానా ప్రభుత్వం గోరక్షక దళాల పేరుతో భజరంగ్‌దళ్ వారికి లైసెన్స్‌లు ఇచ్చిందని అన్నారు. ఇద్దరు ముస్లిం యువకులను బతికుండగానే కాల్చిచంపారని చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనలేదనీ, సమరయోధుల్లేరనీ, ఎవరూ జైలుకు వెళ్లలేదనీ అన్నారు. ప్రశ్నించే వారిని అణచివేసేందుకు ఉపా చట్టాన్ని తెచ్చిందన్నారు. ఎనిమిదేండ్లలో ఆ చట్టం కింద అరెస్టు చేసిన వారికి బెయిల్ ఇవ్వడం లేదని చెప్పారు. 10,500 మందిని అరెస్టు చేస్తే, వారిలో 200 మందికే శిక్ష పడిందని గుర్తు చేశారు. దేశంలో అధిక ధరలతో ప్రజలపై భారాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతున్నదని అన్నారు. కానీ అదానీ రోజుకు రూ.1,216 కోట్లు సంపాదిస్తున్నారని వివరించారు. కార్పొరేట్లకు మోడీ ప్రభుత్వం దోచిపెడుతున్నదని చెప్పారు. ఈ బడ్జెట్‌లో ఆశాలు, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికుల కోసం సరిపోయినన్ని నిధులు కేటాయించలేదని విమర్శించారు. కానీ మోడీ పాలనలో ఒక శాతం సంపన్నుల వద్ద 40 శాతం సంపద కేంద్రీకృతమై ఉందన్నారు. మోడీ ప్రభుత్వ మతతత్వ, కార్పొరేట్ అనుకూల విధానాలతో ముందుకు సాగుతున్నదని చెప్పారు. రాబోయే రోజుల్లో ఆ విధానాలను తిప్పికొట్టేందుకు, దేశాన్ని కాపాడుకునేందుకు, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు.

బిజెపి, ఎంఐఎంను ఓడించడమే లక్ష్యం : ఎండి అబ్బాస్

ఎన్నికల్లో బిజెపి, ఎంఐఎంను ఓడించడమే లక్ష్యమని అధ్యక్షత వహించిన సిపిఎం హైదరాబాద్ సౌత్ కమిటీ కార్యదర్శి ఎండి అబ్బాస్ పిలుపునిచ్చారు. బండి సంజయ్, ఇతర బిజెపి నాయకులు చార్మినార్ వద్ద భాగ్యలక్ష్మి దేవాలయానికి వచ్చి హైదరాబాద్ పేరును మారుస్తామంటున్నారని చెప్పారు. పేర్లు మార్చొద్దంటూ సుప్రీం కోర్టు చెప్పిందని గుర్తు చేశారు. పేర్లు మారిస్తే ఉద్యోగాలొస్తాయా?, మౌలిక వసతులు మెరుగవుతాయా?, నాణ్యమైన విద్య, వైద్యం అందుతుందా?, ఇండ్లు, ఇండ్ల స్థలాలు వస్తాయా? అని ప్రశ్నించారు. ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 17 నుంచి హన్మకొండలో సిపిఐ(ఎం) జాతాను ప్రారంభిస్తుందని చెప్పారు. డబుల్ బెడ్రూం ఇండ్లు, సొంత జాగా ఉన్నోళ్లకు ఆర్థిక సాయం, పోడు భూములకు పట్టాలు వంటి సమస్యలను పరిష్కరించాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరతామన్నారు. పాతబస్తీలో ఎంఐఎం ఎంపీ, ఎమ్మెల్యేలున్నా అభివృద్ధి ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆశాలత, సిపిఎం హైదరాబాద్ సౌత్ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు విఠల్, కోటయ్య, మీనా, పి నాగేశ్వర్‌రావు, అబ్దుల్ సత్తార్, సామాజిక కార్యకర్తలు ఇక్బాల్ జావీద్, నయాముల్లా షరీఫ్, సీనియర్ అడ్వకేట్ అబ్దుల్ ఖుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.



పొలంలో నాగలి పట్టి దుక్కి దున్నుతున్న సుదర్శన్‌రావు

ప్రభుత్వ అసైన్డ్ భూమిని పేదలకు పంచాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ అసైన్డ్ భూమిని పేదలకు పంచాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని మతు సంగెం గ్రామంలో భూపోరాటంలో భాగంగా గురువారం ప్రభుత్వ భూముల్లో ఎర్రజెండాలు పాతి.. సిపిఎం జెండా ఎగురవేశారు. అనంతరం నాగలి పట్టి దుక్కి దున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడా వ్యాపారస్తులకు, కాంట్రాక్టర్లకు వేలాది ఎకరాలప్రభుత్వ భూములను అప్పనంగా అప్పగిస్తున్నాయని, నిరుపేదలకు ఎకరం భూమినైనా ఇవ్వడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో భూమి లేని నిరుపేదలకు మూడెకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయం చేసుకునే వారికి భూమి లేదని.. కానీ వ్యవసాయం చేయని వారికి వేలాది ఎకరాల భూములు ఉన్నాయని అన్నారు. కామారెడ్డి జిల్లాలో వేలాది ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూములున్నాయని, వాటిని వెంటనే పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. మతుసంగెం గ్రామంలో కొందరు రాజకీయ నాయకుల అండదండలతో ప్రభుత్వ అసైన్డ్ భూములను ఆక్రమించుకొని బోగస్ పట్టాలు చేసుకున్నారని, ఇలాంటి భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోని నిరుపేదలకు పంచి పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం దళితులకు మూడెకరాలు భూమి ఇస్తామని హామీ ఇచ్చిందని, ఇలాంటి బోగస్ పట్టాలు రద్దు చేసి దళితులకు, భూమిలేని అన్ని వర్గాల ప్రజలకు భూములు ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకోవాలని లేకుంటే, సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భూపోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్‌వి రమ, జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్, నాయకులు మోతీరాం నాయక్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కమ్మరి సాయిలు, మధు, భీమ్‌సింగ్, లక్ష్మిబాయి, మల్లేష్, రాంసింగ్, చింటూ, దేవిసింగ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఎసిబికి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

- సిసి రోడ్ల పనుల బిల్లుల చెల్లింపుకు రూ.65 వేలు డిమాండ్
- అధికారులను ఆశ్రయించిన కాంట్రాక్టర్ కొమురయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో




జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండలంలోని శివునిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి కుర్ర చిరంజీవి గురువారం ఎసిబి వలకు చిక్కారు. కాంట్రాక్టర్ శివరాత్రి కొమురయ్య నుంచి రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా.. ఎసిబి అధికారులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి ఎసిబి డిఎస్‌పి కె సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో 2022 ఎ1 కాంట్రాక్ట్ 11పనులకుగానూ గ్రామ పంచాయతీ నిధులు రూ.21 లక్షలు ఇచ్చారు. ఈ క్రమంలో సిసి రోడ్లు నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేపట్టారు. పని పూర్తయినందున బిల్లులు చెల్లించాలని గ్రామకార్యదర్శి చిరంజీవికి ఎంబుక్‌లు, పనుల రికార్డులను అప్పగించారు. ఆ పనికి సంబంధించి రూ.65 వేలు లంచం డిమాండ్ చేయగా.. మొదటి విడతగా రూ.15 వేలు ఇచ్చారు. మిగిలిన రూ.50 వేలు ఇవ్వలేనని కాంట్రాక్టర్ వేడుకొన్నప్పటికీ, లంచం ఇస్తేనే బిల్లు చెల్లిస్తామని కార్యదర్శి తెగేసి చెప్పారు. దాంతో కొమురయ్య ఎసిబి అధికారులను ఆశ్రయించారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొమురయ్య రూ.50 వేలు కార్యదర్శికి ఇవ్వగానే, ఎసిబి అధికారులు పట్టుకున్నారు. ఈ దాడిలో ఇన్‌స్పెక్టర్లు రవి, శ్యాంకుమార్, శ్రీను పాల్గొన్నారు.

వేసవిలో శుద్ధ తాగునీరందిస్తాం

- మిషన్ భగీరథ సమీక్షలో మంత్రి ఎర్రబెల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ఈ వేసవిలో తాగునీటి ఇబ్బందులు రానివ్వబోమని, అందరికీ మిషన్‌భగీరథ ద్వారా శుద్ధమైన నీటిని అందిస్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చెప్పారు. గురువారం హైదరాబాద్‌లో గల ఎర్రమంజిల్‌లో మిషన్ భగీరథ-ఎండాకాలం సన్నద్ధతపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రానున్న ఎండాకాలం నేపథ్యంలో నిరాటంకంగా నిర్వర్తించాల్సిన తాగునీటి సరఫరాపై మిషన్ భగీరథ అధికారులకు మంత్రి దిశా నిర్దేశం చేశారు. వేసవిలో రిజర్వాయర్‌లలో నీటి నిలువలు తగ్గకుండా చూడాలని సూచించారు. కరెంట్ సప్లయ్‌తోపాటు పైపులైన్‌లను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. లీకేజీలు రాకుండా చూసేందుకు ప్రత్యేక అధికారులను నియమించామని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కరెంటు సమస్యలొచ్చినా నీటి సరఫరాకు ఆటంకం రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పంపుల మెయింటెనెన్స్ సరిగ్గా చూడాలని, పైప్‌లైన్ లీకేజీలు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఫిల్టర్ బెడ్లు, ట్యాంకుల క్లీనింగ్ చేయాలని ఆదేశించారు. పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలకు తాగునీరు అందించాలన్నారు. ఈ సమీక్షలో ఇఎన్‌సి, ఇఇలు, అన్ని జిల్లాల ఎస్ఇలు, ఇతర ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలను నివేదించండి : హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఆలయ భూముల ఆక్రమణలపై పత్రికల్లో వచ్చిన వార్తను హైకోర్టు పిల్‌గా స్వీకరించి విచారణ చేపట్టింది. ఆక్రమణల నివారణకు, ఆలయ భూముల రక్షణకు తీసుకున్న చర్యలను వివరిస్తూ కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్ 13కు వాయిదా వేస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్‌భూయాన్, జస్టిస్ తుకారాంజీలతో కూడిన ధర్మాసనం గురువారం ఆదేశాలు జారీ చేసింది. విచారణను వేసవి సెలవుల తర్వాత చేపడతామని ప్రకటించింది.

రాష్ట్రంలో కరెంటు డిమాండ్ పెరిగింది

- టిఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సిఎండి డి ప్రభాకరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగిందని టిఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సిఎండి దేవులపల్లి ప్రభాకరరావు తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారిగా మంగళవారం విద్యుత్ డిమాండ్ 14,794 మిలియన్ యూనిట్లకు చేరితే, 290 మి.యూ., సరఫరా చేశామని వివరించారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌పై మంగళవారంనాడాయన ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గతేడాదికంటే ఈసారి 30 శాతం విద్యుత్ వినియోగం పెరిగిందని అధికారులు ఈ సందర్భంగా ప్రస్తావించారు. వ్యవసాయరంగానికి దాదాపు 30 శాతం, పరిశ్రమలకి 20 శాతం వినియోగం పెరిగిందని తెలిపారు. మార్చి నెలలో 300 మి.యూ., తో 16 వేల మెగా వాట్ల పీక్ డిమాండ్ వస్తుందని అంచనా వేసినట్టు ఈ సందర్భంగా ప్రభాకరరావు తెలిపారు. ఎన్‌టిపిసి నుంచి ఏడాది కిందే విద్యుత్ సరఫరా రావాల్సి ఉండగా, ఇప్పటి వరకు రాలేదన్నారు. కరెంటు కొనుగోలుకు ఇప్పటికే రూ. వెయ్యి కోట్లు ఖర్చు అయ్యాయనీ, రానున్న రోజుల్లో మరో రూ.1,500 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశామన్నారు. సిఎం కెసిఆర్ డబ్బుకు ఇబ్బంది లేదని, వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని చెప్పారని వివరించారు.

మహాసభలో ఆమోదించిన తీర్మానాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మిర్యాలగూడలో నిర్వహించిన తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలో పలు తీర్మానాలు చేశారు.

- గిరిజన బంధు తక్షణమే అమలు చేయాలి.
- పోడు భూములను సాగు చేసుకుంటున్న రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలి.
- వాల్మీకిబోయ ఇతర 11 కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చకూడదు.
- గిరిజన యూనివర్సిటీని తక్షణమే ఏర్పాటు చేయాలి.
- పది శాతం రిజర్వేషన్‌పై తొమ్మిదో షెడ్యూల్లో చేర్చాలి.
- గిరిజనుల మధ్య ఘర్షణ పెంచుతున్న బిజెపి వైఖరిని ఖండించాలి.
- తండా పంచాయతీలకు సంవత్సరానికి రూ.ఐదు కోట్ల నిధులు ఇవ్వాలి.
- మైదాన ప్రాంత గిరిజనులకు ఐటిడిఎ ఏర్పాటు చేయాలి.
- కేంద్రం తీసుకొస్తున్న అటవీ సంరక్షణ నియమాలను ఉపసంహరించుకోవాలి.
- లంబాడి, ఇతర తెగల భాషలను ఎనిమిదో షెడ్యూల్లో చేర్చాలి.
- గిరిజన విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్స్ స్కూల్ పథకంలో ప్రతి సంవత్సరం 2000 సీట్లు కేటాయించాలి.
- ట్రైకార్ కింద దరఖాస్తు పెట్టుకున్న గిరిజనులకు రుణాలు ఇవ్వాలి.
- జాటోతు తానునాయక్ మ్యూజియం ఏర్పాటు చేసి విగ్రహం పెట్టాలి.
- గిరిజన విద్యార్థులకు పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వాలి.
- భూమి లేని గిరిజనులకు ముడెకరాల భూమి ఇవ్వాలి.
- గిరిజన విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలి.
- ప్రయివేటు రంగంలో రిజర్వేషన్ కల్పించాలి.
- జిల్లా యూనిట్‌గా తీసుకొని అసెంబ్లీ సీట్లను కేటాయించాలి.
- బడ్జెట్లో కేటాయించిన నిధులన్నీ ఖర్చు చేయాలి.
- పుట్టిన ప్రతి గిరిజన బిడ్డకూ రూ.ఐదు లక్షలు డిపాజిట్ చేయాలి.



10న ఢిల్లీలో దీక్ష

- పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలి
- ఎమ్మెల్సీ కవిత డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10వ తేదీ ఢిల్లీలో నిరాహార దీక్ష చేపడుతున్నట్టు భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చెప్పారు. గురువారంనాడిక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై బిజెపి తన ఎన్నికల మేనిఫెస్టోలో రెండుసార్లు హామీ ఇచ్చిందని, అమల్లోకి మాత్రం తేవట్లేదని అన్నారు. ఇందుకు నిరసనగా భారత జాగతి ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఒక రోజు నిరాహార దీక్ష చేస్తున్నట్టు ప్రకటించారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దీక్ష చేపట్టాలనుకున్నామని, అయితే ఆ రోజు హోలీ పండుగ ఉన్నందున 10వ తేదీన దీక్ష చేపడుతున్నట్టు చెప్పారు. ఈ దీక్షకు అన్ని పార్టీలు, సంఘాలను ఆహ్వానిస్తున్నామన్నారు. మార్చి 13 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈ సెషన్‌లోనే మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2014, 2019 ఎన్నికల్లో బిజెపి మహిళా రిజర్వేషన్ బిల్లుకు చట్టరూపం కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిందని తెలిపారు. తొమ్మిదేండ్లయినా దీనికి చట్టబద్ధత ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు.

నేడు తిమ్మాపూర్ వెంకన్న బ్రహ్మోత్సవాలకు సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు బుధవారం కామారెడ్డి జిల్లాలో పర్యటించనున్నారు. తెలంగాణ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన బాన్సువాడ నియోజకవర్గం బీర్కూర్ మండలం తిమ్మాపూర్ వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకల్లో పాల్గొననున్నారు. ఉదయం బేగంపేట నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి బాన్సువాడ పట్టణంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు 10.40 గంటలకు చేరుకుంటారు. అనంతరం అక్కడి నుంచి కాన్వాయ్‌లో 10.55 గంటలకు తిమ్మాపూర్‌లోని తిరుమల వేంకటేశ్వర ఆలయానికి చేరుకుంటారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో సిఎం స్వయంగా పాల్గొంటారు. అనంతరం ఇక్కడే ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభకు హాజరవుతారు. బ్రహ్మోత్సవంలో పాల్గొన్న అనంతరం బాన్సువాడ నుంచి సిఎం బయలుదేరి మధ్యాహ్నం 2.15 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారని సిఎంఒసిఎంఒ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. దాదాపు రెండున్న గంటల పాటు సిఎం పర్యటన కొనసాగనుంది. ఈ నేపథ్యంలో బాన్సువాడ పట్టణంతో పాటు, ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాలను సిఎం ప్రత్యేక వ్యక్తిగత రక్షణ బందం, డాగ్ స్కాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించారు. కృతజ్ఞత సభ కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు వేదికను సిద్ధం చేస్తున్నారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

పోరాటాలతోనే మెస్‌ఛార్జీల పెంపు

- ధరలకనుగుణంగా పెంచాలి
- కాస్మోటిక్ చార్జీలు నెలకు రూ.వెయ్యి ఇవ్వాలి
- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోరాటాల ఫలితంగానే సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర కమిటీ తెలిపింది. కానీ పెంచిన చార్జీలు నామమాత్రమేనని, పెరిగిన ధరలకనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేసింది. మరి కాస్మోటిక్ చార్జీల సంగతేంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కాస్మోటిక్ చార్జీలు నెలకు రూ.వెయ్యి వరకు పెంచాలని కోరింది. ఈ మేరకు ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇల్లు అలకగానే పండుగ కాదని, మెస్ చార్జీలు పెంచగానే హాస్టళ్ల సమస్యలు పోవని తెలిపారు. కేవలం మెస్ చార్జీలే నామమాత్రంగా పెంచారు తప్ప, కాస్మోటిక్ చార్జీలను పెంచలేదని పేర్కొన్నారు. సమస్యలన్నింటికీ మూలం మెస్ చార్జీలు కాదని, మౌలిక వసతులు మెరుగుపర్చుకుంటే వాటిని ఏర్పాటు చేసిన లక్ష్యం నెరవేరదని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, వెనుకబడిన తరగతుల విద్యాభివృద్ధికి పట్టుకొమ్మలుగా ఉన్న హాస్టళ్ల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక నిధులివ్వాలని డిమాండ్ చేశారు. నిధులు అడిగితే ఈ హాస్టళ్లను నిర్వీర్యం చేయాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. హాస్టళ్ల రక్షణ కోసం ప్రతినబూని మెస్ చార్జీలు పెంచాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా 27 జిల్లాలో 23,571 కిలోమీటర్లపాటు సైకిల్ యాత్రలు, బైక్ యాత్రలు చేశామని గుర్తు చేశారు. హాస్టళ్లను సందర్శించి సమస్యలు వెలుగులోకి తీసుకొచ్చి వాటి పరిష్కారం కోసం దశల వారీగా ఆందోళన చేశామని తెలిపారు. ఏటా శ్వాశత వార్షిక సమీక్ష కమిటీ ఏర్పాటు చేసి పెరుగుతున్న నిత్యావసర ధరలకనుగుణంగా హాస్టళ్ల నిర్వహణకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఐదేండ్ల తర్వాత ఇప్పుడు మెస్‌చార్జీలను 25 శాతం పెంచి భారీగా పెంచామంటున్నారని పేర్కొన్నారు. గత ఐదేండ్ల నుంచి నిత్యావసరాల ధరలు 25 శాతం మాత్రమే పెరిగాయా?, కేవలం మెస్ చార్జీలు పెంచడంతో ప్రభుత్వ బాధ్యత తీరిపోతుందా?అని ప్రశ్నించారు. హాస్టళ్లలో వసతులు, మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచడానికి ఇప్పటికీ ఒక యంత్రాంగం లేదని విమర్శించారు. అసెంబ్లీలో, పార్లమెంట్‌లో గౌరవ సభ్యుల జీతాలు పెంచడానికి స్థాయి సంఘాలు, ఉద్యోగుల వేతనాలకు పిఆర్‌సి కమిటీలున్నాయని గుర్తు చేశారు. కానీ విద్యార్థుల అవసరాలు తీర్చేందుకు ఎలాంటి యంత్రాగం లేదని తెలిపారు. జిఒ నెంబర్ 126 ప్రకారం వారికి ఇవ్వాల్సిన అన్ని సౌకర్యాలూ కల్పించాలని కోరారు. లేకుంటే భవిష్యత్ పోరాటాలను మళ్లీ ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గురుకులాలు, కెజిబివి, సంక్షేమ హాస్టళ్లను సందర్శించి సమస్యలపై పోరాటాలకు రూపకల్పన చేస్తామని తెలిపారు.

భూపాలపల్లిలో హై టెన్షన్..

- 'గండ్రల' సవాళ్లు, ప్రతిసవాళ్లతో ఉద్రిక్తత
- 144 సెక్షన్ అమలు.. భారీగా మోహరించిన పోలీసులు
- బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే గండ్ర, కాంగ్రెస్ నేత సత్యనారాయణ హౌస్ అరెస్ట్

ప్రజాక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ నేత గండ్ర సత్యనారాయణ సవాళ్లు.. ప్రతిసవాళ్లతో జయశంకర్-భూపాలపల్లి జిల్లాలో గురువారం ఉద్రిక్తత ఏర్పడింది. ఈ క్రమంలో పోలీసులు 144 సెక్షన్ విధించి.. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌తోపాటు ఆయా మండలాల్లో భారీగా మోహరించారు. ఉదయమే కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గండ్ర సత్యనారాయణరావును, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు గండ్ర జ్యోతిని హౌస్ అరెస్టు చేశారు. ఇదిలా ఉంటే, జిల్లా కేంద్రంతోపాటు భూపాలపల్లి నియోజకవర్గంలోని ఆయా మండలాల అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలను, కాంగ్రెస్ పార్టీ నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. గత బుధవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర రమణారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గండ్ర సత్యానారాయణ పోటాపోటీగా సవాళ్లు విసురుకున్న విషయం తెలిసిందే. తాను ఎలాంటి అక్రమాలు, భూ ఆక్రమణలకూ పాల్పడలేదని, కాంగ్రెస్ పార్టీకి దమ్ముంటే నిరూపించాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే అక్రమాలు, కబ్జాలపై ఆధారాలతో సిద్ధంగా ఉన్నా.. నిరూపించేందుకు గురువారం భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్‌లో చర్చకు రావాలంటూ గండ్ర సత్యనారాయణ ప్రతి సవాల్ విసిరారు. దీంతో భూపాలపల్లి రాజకీయాల్లో ఉద్రిక్తంగా మారింది. వరుసగా మూడు రోజులుగా భూపాలపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్, బిఆర్‌ఎస్ నేతల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. రేవంత్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా కాంగ్రెస్ నేతలు ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలను, కటౌట్లను కట్టనీయకుండా బిఆర్‌ఎస్ నేతలు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. అదేరోజు సాయంత్రం పబ్లిక్ మీటింగ్‌లో రేవంత్ రెడ్డి ప్రసంగిస్తుండగా కాంగ్రెస్ నేతలపై, రేవంత్ రెడ్డి కాన్వాయ్ పై రాళ్లు, కోడిగుడ్లతో దాడి జరిగింది. ఇదంతా గండ్ర రమణారెడ్డి అనుచరులే చేస్తున్నారని, ఎమ్మెల్యే పథకం ప్రకారం వరుస దాడులకు ఉసిగొల్పుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే గండ్ర, కాంగ్రెస్ నేత సత్యనారాయణ సవాళ్లు విసురుకోవడం, గురువారం భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్లో వేదికగా నిర్ణయించుకోవడంతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. గురువారం నుంచి వారం రోజులపాటు జిల్లా కేంద్రంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్‌పి సురేందర్ రెడ్డి తెలిపారు.



భూపాలపల్లిలో 144 సెక్షన్ అమలు చేస్తున్న పోలీసులు

గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్యే గండ్ర హౌస్ అరెస్ట్

అంబేద్కర్ సెంటర్ వేదికగా బహిరంగ చర్చకు రానున్న నేపథ్యంలో హన్మకొండలో నివాసముంటున్న కాంగ్రెస్ నేత గండ్ర సత్యనారాయణను తెల్లవారుజామునే హౌస్ అరెస్టు చేసి భారీగా పోలీసులు మోహరించారు. అలాగే, బహిరంగ చర్చకు వచ్చేందుకు సిద్ధపడుతున్న తరుణంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని బిఆర్‌ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షులు గండ్ర జ్యోతిని భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హౌస్ అరెస్టు చేశారు.

భారీ బందోబస్తు

జిల్లా కేంద్రంలో ఎస్‌పి సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు చేపట్టారు. ఉదయం నుంచి కాంగ్రెస్, బిఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులను, కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అంబేద్కర్ చౌరస్తాలో భారీగా పోలీసులు మోహరించారు.

పోటాపోటీగా దిష్టిబొమ్మల దహనం

144 సెక్షన్ అమల్లో ఉన్నా జిల్లా కేంద్రంలోని జయశంకర్ విగ్రహం ముందు బిఆర్‌ఎస్ కార్యకర్తలు టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గండ్ర సత్యనారాయణరావు దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఇది తెలుసుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు సైతం ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

బాలునిపై గంజాయి గ్యాంగ్ దాడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డబ్బుల కోసం బాలుడిని గంజాయి గ్యాంగ్ గుట్టలపైకి తీసుకెళ్లి దారుణంగా కొట్టి హింసించిన ఘటన రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు, బాలుడి తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ పరిధిలోని శాస్త్రిపురం దానమ్మ జోపిడి కిరణా షాప్‌కి బాలుడు వెళ్లాడు. అక్కడే స్థానికంగా ఉండే గంజాయికి బానిసైన మహ్మద్ సైఫ్, అబ్బూ, సమీర్ బాలునికి మాయమాటలు చెప్పి సమీపంలోని గుట్టలపైకి తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లిన తర్వాత బాలుని డబ్బులు ఇవ్వమని అడిగారు. తన వద్ద డబ్బులు లేవని చెప్పడంతో అతన్ని తీవ్రంగా కొట్టి, హింసించారు. కొద్దిసేపటి తర్వాత ఆ బాలుడు వారి నుంచి తప్పించుకొని వచ్చి తల్లిదండ్రులకు జరిగిన విషయం చెప్పాడు. తీవ్రంగా గాయపడిన బాలుడిని తల్లిదండ్రులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. వెంటనే మైలార్‌దేవపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

అంతర్జాతీయ ఆర్థిక సహకారానికి జి20

- ఆర్‌బిఐ రీజినల్ డైరెక్టర్ కె నిఖిల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంతర్జాతీయ ఆర్థిక సహకారానికి జి20 ఎంతో ఉపయోగపడుతున్నదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ డైరెక్టర్ కె నిఖిల తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ 2022 డిసెంబర్ ఒకటి నుంచి 2023 నవంబర్ 30 వరకు జి20 ప్రెసిడెన్సీ పేరుతో జి20పై అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గురువారం హైదరాబాద్ బిట్స్ పిలానీ క్యాంపస్‌లో వాతావరణ మార్పు-సుస్థిర ఆర్థిక వ్యవస్థ నిర్వహించిన కార్యక్రమంలో నిఖిల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఆర్థికాంశాలతో పాటు ఆయా దేశాలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు తీసుకుంటున్న చర్యలను తెలుసుకునేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడుతున్నాయని వివరించారు. పాలనలో వస్తున్న మార్పులపై ఆర్థిక ప్రభావాన్ని వివరించారు. విద్యార్థులు ఆసక్తిగా తెలుసుకుంటున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఐఐటితో పాటు తొమ్మిది కాలేజీల విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన సంఘం నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక

- రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా ధర్మానాయక్, శ్రీరాంనాయక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర నూతన కమిటీ గురువారం ఎన్నికైంది. మిర్యాలగూడలోని ముడావత్ బిక్షానాయక్ నగర్‌లో జరిగిన ఆ సంఘం మూడో మహాసభలు విజయవంతంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రతినిధులు 57 మందితో కూడిన కొత్త కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో ఆఫీసు బేరర్లుగా 13 మందిని మహాసభ ఎన్నుకుంది. రాష్ట్ర అధ్యక్షులుగా ఎం.ధర్మానాయక్, కార్యదర్శిగా ఆర్ శ్రీరాంనాయక్ తిరిగి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా గుగులోతు ధర్మ, డి రవినాయక్, గుగులోత్ భీమాసాహెబ్, వి వీరన్న, కొర్ర శంకర్, సహాయకార్యదర్శులుగా భూక్య వీరభద్రం, ఆంగోత్ వెంకన్న, ఎం.బాలునాయక్, ఎం రవినాయక్, ఎం శంకర్‌నాయక్‌తోపాటు ఒక మహిళను కోఆప్షన్ సభ్యురాలిగా మహాసభ ఎన్నుకుంది.

11నుంచి నేషనల్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో-2023

- పీపుల్స్ ప్లాజాలో 24వరకు కొనసాగింపు : బుద్ధప్రకాశ్ జ్యోతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్డులోని పీపుల్స్‌ప్లాజాలో ఈ నెల 11 నుంచి 24వ తేదీ వరకు నేషనల్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో-2023 జరుగనుంది. గురువారం ఈ మేరకు హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్, అపెరల్ ఎక్స్‌పోర్ట్ పార్క్స్ కమిషనర్ బుద్ధప్రకాశ్ జ్యోతి ఒక ప్రకటన విడుదల చేశారు.



టివిఎస్ నుంచి ఐక్యూబ్ ఎలక్ట్రిక్ స్కూటర్లు

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో టివిఎస్ ఐక్యూబ్ ఎలక్ట్రిక్ స్కూటర్‌లను ఆ కంపెనీ ఆవిష్కరించింది. సికింద్రాబాద్‌లోని కిరణ్ టివిఎస్ షోరూమ్‌లో రెండు మోడళ్లను టివిఎస్ మోటార్ కంపెనీ ఏరియా మేనేజర్ విశాల్ విక్రమ్ సింగ్ విడుదల చేశారు. ఆ కంపెనీ ఏరియా సర్వీస్ మేనేజర్ బాలకష్ణన్, ఇ మొబిలిటీ స్టేట్ హెడ్ రవి కిరణ్, కిరణ్ టివిఎస్ ప్రమోటర్ రాజేష్ ధండాబీ, ప్రమోటర్ సాకేత్ కుమార్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కిరణ్ టివిఎస్ మూడు దశాబ్దాలుగా ఎంతో విశ్వసనీయమైన టివిఎస్ డీలర్‌గా జంట నగరాలలోని ఖాతాదారులకు తన సేవలను అందిస్తుందని రాజేష్ ధండాబీ తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో తమకు 23 శాతం మార్కెట్ వాటా ఉందన్నారు. వీటి ధర పరిధి రూ.1,15,000 నుండి ప్రారంభమవుతుందన్నారు.

కదం తొక్కిన అంగన్‌వాడీలు

- తమ సమస్యలపై భారీ నిరసన ర్యాలీలు
- కలెక్టరేట్లు, ఐసిడిఎస్ కార్యాలయాల ఎదుట ధర్నా
- అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
- అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి జయలక్ష్మి



సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ కదం తొక్కారు. ఐసిడిఎస్‌ను ప్రయివేటీకరించే కుట్రను నిరసిస్తూ.. తమ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని గ్రాట్యుటీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. మూడ్రోజులపాటు సమ్మె చేపట్టారు. గురువారం రెండో రోజు భారీ నిరసన ర్యాలీలు తీశారు. అనంతరం కలెక్టరేట్లు, ఐసిడిఎస్ కార్యాలయాల ఎదుట ధర్నా చేశారు.

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలో గ్రాట్యుటీ చట్టాన్ని అమలు చేయాలని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి జయలక్ష్మి, సిఐటియు యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ఎదుట వందలాది మందితో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, ఐసిడిఎస్‌కు కేంద్రం బడ్జెట్ పెంచాలని, నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టీచర్లతో సమానంగా అంగన్వాడీ ఉద్యోగులకు వేతనం, పెన్షన్, ఇఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సౌకర్యాలు కల్పించాలని, జిఒ నెం 14, 19, 8ను వెంటనే సవరించాలని కోరారు.

ధర్నాలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి

అంగన్‌వాడీల సమస్యలను ముఖ్యమంత్రి కెసిఆర్ దృష్టికి తీసుకెళ్తామని, ఈ విషయంపై ఈరోజే ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని మాజీ ఎమ్మెల్యే జూలకటి రంగారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ చెన్నయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ.. ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేయాలని, అంగన్వాడీలపై రాజకీయ ఒత్తిడిలను తగ్గించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకే ఫుడ్ సరఫరా చేయాలన్నారు. నల్లగొండ ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహించారు.

రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అంగన్‌వాడీలు ధర్నాలు, ర్యాలీలు, నిరసనలు తెలిపారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలకేంద్రంలో ఒంటి కాలిపై నిల్చొని నిరసన తెలిపారు. ఆమనగల్‌లో సిఐటియు జిల్లా నాయకులు కురుమయ్య ఆధ్వర్యంలో ఐసీడీఎస్ కార్యాలయం నుంచి స్థానిక బస్టాండ్ వరకు భారీ ర్యాలీ తీశారు. మాడ్గుల, కడ్తాల్, తలకొండపల్లి, ఆమనగల్ ఐసిడిఎస్ పరిధిలోని సుమారు 300 మంది అంగన్‌వాడీలుఈ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. రాజేంద్రనగర్ ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. అనంతరం చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ తీశారు.

హన్మకొండ కలెక్టరేట్ వరకు ప్రదర్శన చేశారు. ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం పద్మ ఆధ్వర్యంలో వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. మహబూబాబాద్ ఆర్‌టిసి బస్టాండ్ నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. జనగామ జిల్లా కలెక్టరేట్ ఎదుట బైటాయించి ప్లకార్డులు ప్రదర్శించారు. కలెక్టరేట్ ఎదుట వంటావార్పు, భోజనాలు చేసి తమ బాధలను వెలిబుచ్చారు.

ఖమ్మం జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలు దీక్ష చేపట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో కలెక్టరేట్ ఎదుట దీక్ష చేపట్టారు. ఈ దీక్షలను సిఐటియు జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ ప్రారంభించారు. ఈ దీక్షలో ఓ టీచర్ తన చంటి బిడ్డతో వచ్చి పాల్గొన్నారు.

ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ ఎదుట రెండో రోజు దీక్షా శిబిరాన్ని కొనసాగించారు. నిర్మల్ జిల్లా కలెక్టరేట్, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఐసిడిఎఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు నిరసన తెలిపారు.

మంత్రి కెటిఆర్‌కు ధన్యవాదాలు

- తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో141 మున్సిపాల్టీల్లో రూ:282 కోట్లతో ఆధునిక ధోబిఘాట్లు నిర్మించేందుకు వీలుగా ఉత్తర్వులు జారీ చేసినందుకు పురపాలకశాఖ మంత్రి కె తారకరామారావుకు తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు గురువారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడిరాజు నరేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలనే సంకల్పంతో రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో దానికి రూ.రెండు కోట్లతో రూ.282 కోట్లతో ఉత్తర్వులు జారీ చేయడాన్ని స్వాగతించారు. రజక వృత్తిదారుల సంఘం ఎన్నో సంవత్సరాల నుంచి అనేక ఉద్యమాలు, ఆందోళనలు నిర్వహించి అన్ని జిల్లాలు, మున్సిపాల్టీ, మండల కేంద్రాల్లో మెకనైజ్ లాండ్రీ (ధోబిఘాట్లు) నిర్మించాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించిందని గుర్తుచేశారు. ప్రత్యేకంగా ఎగ్జిబిషన్స్ కూడా నిర్వహించిందని, ప్రభుత్వానికి వినతిపత్రాలూ ఇచ్చిందని తెలిపారు. ప్రభుత్వం ప్రకటనల వరకే పరిమితం కాకుండా త్వరితగతిన నిధులు విడుదల చేసి, స్థలాలు కేటాయించి, అన్ని జిల్లాల్లో నిర్మాణాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

నిమ్స్‌లో చిన్నారులకు గుండె సర్జరీలు

- యుకె నుండి వచ్చిన వైద్య బృందం సహకారం
- మంత్రి హరీశ్‌రావు ఆహ్వానం మేరకు వచ్చిన బ్రిటన్ బృందం
- నాలుగు రోజుల్లో ఎనిమిది మందికి ఆపరేషన్లు పూర్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిమ్స్ ఆస్పత్రిలో గత నాలుగు రోజులుగా చిన్నారులకు అరుదైన గుండె సర్జరీలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు ఎనిమిది మందికి సర్జరీలు పూర్తయ్యాయి. వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు ఆహ్వానం మేరకు బ్రిటన్ నుంచి డాక్టర్ వెంకట రమణ దన్నపునేని నేతృత్వంలోని ఆరుగురు వైద్యుల బృందం, నిమ్స్ వైద్యులు, నీలోఫర్ హాస్పిటల్ డాక్టర్ల పరస్పర సహకారంలో ఈ సర్జరీలు నిర్వహించారు. చిన్నారులకు గుండె సర్జరీలు చేయడం అనేది ఎంతో క్లిష్టమైనది. ఖరీదైనది. ప్రయివేటులో దాదాపు రూ.ఐదు లక్షల వరకయ్యే ఈ చికిత్సను పేద చిన్నారులకు ఉచితంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన. ఇందులో భాగంగా నెల రోజుల వయసున్న శిశువుకు సర్జరీ విజయవంతంగా చేయడం జరిగింది. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్‌కు చెందిన నెల రోజుల వయసున్న శిశువు (తల్లి ఫాతిమా) ఇటీవల తీవ్ర హృద్రోగ సమస్యలతో నిమ్స్ ఆసుపత్రిలో చేరింది. అప్పటికే శిశువు బరువు కేవలం 2.5 కిలోలు. ఆర్టీరియల్ అనాటమీ, మల్టిపుల్ వెంట్రిక్యులార్ సెప్టల్ డిఫెక్ట్స్‌తో హాస్పిటల్‌లో చేరింది. బ్రిటన్ నిపుణులు, నిమ్స్ వైద్యులు, నీలోఫర్ డాక్టర్లు కలిసి ఒక బృందంగా ఏర్పడ్డారు. గత నెల 28వ తేదీన శిశువుకు ఆర్టీరియల్ స్విచ్ రిపేయిర్, మల్టిపుల్ వీఎస్‌డీ క్లోజర్ సర్జరీలు విజయవంతంగా నిర్వహించారు. ప్రభుత్వ దవాఖానలో ఇలాంటి సర్జరీ జరగడం రాష్ట్రంలోనే మొదటిసారి కాగా, శిశువు ప్రస్తుతం ఐసియులో ఉంది. క్రమంగా కోలుకుంటోంది.

మంత్రి హరీశ్ రావు అభినందనలు

అరుదైన సర్జరీ చేసి శిశువు ప్రాణం కాపాడిన నిమ్స్ వైద్యులను వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అభినందించారు. బ్రిటన్ నుంచి ప్రత్యేక వైద్య బృందం వచ్చి నిమ్స్ లో చిన్నారులకు చేసే సర్జరీల్లో పాల్గొనడం, సహకారం అందించడం గొప్ప విషయం. శిశువు త్వరలోనే పూర్తిగా కోలుకొని తల్లి ఒడికి చేరాలని ఆకాంక్షించారు.

బిజెపి, బిఆర్‌ఎస్ అవిభక్త కవలలు

- బొగ్గు బ్లాక్‌లను బంధువులకు కట్టబెట్టుకున్నారు
- టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి

నవతెలంగాణ- కోల్ బెల్ట్

"బిజెపి, బిఆర్ఎస్ అవిభక్త కవలలు.. కాంగ్రెస్‌కు అధికారం కొత్తేమీ కాదు.. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియా గాంధీకి కృతజ్ఞతగా మరొక్కసారి ప్రజలు అధికారం ఇస్తే అసలైన తెలంగాణ ఏంటో చూపిస్తాం." అని టిపిసిసి అధ్యక్షులు ఎనమల రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ జోడో యాత్రలో భాగంగా మంగళవారం జయశంకర్ జిల్లా కేంద్రంలోని భూపాలపల్లి ఏరియా కేటికె-5 గనిలో ఐఎన్‌టియుసి భూపాలపల్లి బ్రాంచ్ ఉపాధ్యక్షులు జోగ బుచ్చయ్య అధ్యక్షతన గేట్‌మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో సింగరేణి, ఆర్‌టిసి, విద్యుత్ కార్మికులు పాల్గొని సకలజనుల సమ్మె చేస్తేనే రాష్ట్రం వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సమ్మెను చూసి స్పందించి ఢిల్లీ పార్లమెంట్‌లో రాష్ట్ర ఏర్పాటు బిల్లు ప్రవేశపెట్టారని తెలిపారు. తద్వారా ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ నామరూపాలు లేకుండా పోయిందని, కేంద్రంలో అధికారం కోల్పోయిందని, ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ కెసిఆర్ పాలైందని అన్నారు. 9 సంవత్సరాలుగా కేసీఆర్ కుటుంబం ప్రజలను దోచుకుంటూ రూ.కోట్లు కొల్లగొడుతోందని ఆరోపించారు. బిఆర్ఎస్ అధికారంలో ఉండి.. టిబిజికెఎస్ సంఘానికి గౌరవాధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, ఆర్‌టిసి సంఘానికి గౌరవ అధ్యక్షుడు హరీశ్‌రావు ఉండి కూడా కార్మిక సమస్యలు ఎందుకు పరిష్కారం కావట్లేదో కార్మికులు ఆలోచించాలన్నారు.

ప్రజలు, కార్మికులు కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు. సమస్యలు చెబితే సరిపోదని, పెన్ను, పేపరు, అధికారం ఇస్తే.. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని బతికించుకుందామని తెలిపారు. మోడీ, కెసిఆర్ ఒకే తల, రెండు దేహాలు కలిగి ఉన్నారని, పైకి మాత్రమే ప్రయివేటీకరణ, రైతు చట్టాలు తదితర అంశాలపై పోరాడినట్టు కెసిఆర్ నటిస్తున్నారని విమర్శించారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకం అంటూనే.. తాడిచర్ల బొగ్గు బ్లాక్‌ను తన బంధువు ప్రతిమ శ్రీనివాస్‌కు, కోయగూడెం ఓసీ అరబిందో ఫార్మాకు కట్టబెట్టిండని.. దాంట్లో వారి వాటా ఎంతో చెప్పాలని ప్రశ్నించారు.మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. కార్మికుల కష్టంతో లాభాలు వస్తే నిధులు తీసుకెళ్లి సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్, పాలకుర్తిలో ఎందుకు ఖర్చు పెడుతున్నారని నిలదీశారు. భూపాలపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ.. లాభాలలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం అదానీ, అంబానీలకు దోచిపెట్టడమే పరమావధిగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపి సిరిసిల్ల రాజయ్య, ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జి అయిత ప్రకాష్‌రెడ్డి, నాయకులు మధుకర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, పొనగంటి కృష్ణ, వేణుగోపాల్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఎండిసి గనులకు ఐబిఎం 5స్టార్ రేటింగ్

హైదరాబాద్ : ఎన్ఎండిసి ముడి ఇనుప ఖనిజం గనులకు ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ (ఐబిఎం) 5 స్టార్ రేటింగ్ ఇచ్చిందని ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. కిరన్‌డుల్ డాపాజిట్-14ఎంజడ్, కిరన్‌డుల్ డిపాజిట్-14 ఎన్ఎంజడ్, బచెలి డిపాజిట్-5 గనులకు ఈ విశిష్ట గుర్తింపు లభించిందని పేర్కొంది. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో ఈ గుర్తింపు పత్రాన్ని పార్లమెంటరీ వ్యవహారాలు, బొగ్గు, గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ ఎన్ఎండిసి ప్రొడక్షన్ డైరెక్టర్ దిలీప్ కుమార్ మోహంతికి అందజేశారని తెలిపింది.

నటుడు అర్షద్ వార్సీపై సెబీ నిషేధం



ముంబయి : సోషల్ మీడియా ద్వారా స్టాక్ మార్కెట్ మానిప్యులేషన్‌కు పాల్పడిన సాధన బ్రాడ్‌కాస్ట్ ప్రమోటర్లపై సెబీ చర్యలకు దిగింది. యూట్యూబర్లతో కుమ్మక్కై తప్పుడు వీడియోలతో అమాయక పెట్టుబడిదారులను మోసం చేస్తున్నారని గుర్తించింది. దీనిపై ఫిర్యాదులు అందాయని తెలిపింది. ముఖ్యంగా యూట్యూబ్‌లో తప్పుదోవ పట్టించే వీడియోలను అప్‌లోడ్ చేయడం ద్వారా సాధన బ్రాడ్‌కాస్ట్ షేర్లను మానిప్యులేట్ చేశారంటూ బాలీవుడ్ నటుడు అర్షద్ వార్సీపై, అతని భార్య మరియా గోరెట్టిని స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ చేయకుండా నిషేధం విధించింది. బ్రాడ్‌కాస్ట్ ప్రమోటర్లతో సహా.. 31 యూట్యూబర్లపై చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. మానిప్యులేషన్ ద్వారా అర్షద్ వార్సీ రూ.29.43 లక్షలు, ఆయన భార్య రూ.37.56 లక్షల లాభం ఆర్జించారని సెబీ గుర్తించింది.

ఫీజురీయంబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి : టి నాగరాజు

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయి వెంటనే విడుదల చేయాలని, మెస్, కాస్మోటిక్స్ చారిరీలను రూ.1500 నుంచి రూ. మూడు వేలకు పెంచాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.3,500 కోట్లు ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పెండింగ్‌లో ఉండటం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వారి విద్యాసంవత్సరం పూర్తయి చాలాకాలం అవుతున్నా రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. విద్యార్థులు కళాశాలల్లో సర్టిఫికెట్లు అడిగితే ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల కాలేదని, ఫీజు మొత్తాన్ని చెల్లించి సర్టిఫికెట్లు తీసుకుపోవాలని యాజమాన్యాలు చెబుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల డబ్బుల్లేక తమ సర్టిఫికెట్లను తీసుకోలేని స్థితిలో ఉన్నారన్నారు. దాంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్నారు.

ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెరుగుతున్న ధరలకు అనుగుణంగా స్కాలర్‌షిప్ పెంచాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి లెనిన్ గువేరా, అశోక్ రెడ్డి, నాగేందర్ వీరేందర్, కార్యకర్తలు కవిత, సంధ్య, శివ, వేణు, వసు, అజయ్ తదితరులు ఉన్నారు.



'గౌస్ ఏ షామ్ మస్తానీ' గానం మస్త్

ప్రజాశక్తి - కల్చరల్

భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రవీంద్ర భారతి ప్రధాన వేదికపై ప్రముఖ బాలీవుడ్ గాయకుడు హైదర్ గౌస్ కరోకి పాటల విభావరి గురువారం జరిగింది. వాయిద్య బృందం లేకుండా ముందుగానే రికార్డ్ చేసిన ట్రాక్ మ్యూజిక్‌కు అనుగుణంగా గాయకులు పాటను అలపించారు. పేరు పొందిన గౌస్ ఏ షామ్ మస్తానీ శీర్షికన హిందీ నేపథ్య గాయకుడు కిషోర్ కుమార్ పాడిన పాటలు పాడి మధురానుభూతిని పంచారు. దీపాధర్, అంజలి విశాఖలు యుగళ గీతలలో గౌస్‌కు సహ గళం కలిపారు. హమీద్ కమాల్ వ్యాఖ్యానం ఆకట్టుకోగా విరామ సమయంలో ఆయన హాస్య సంభాషణలు ఆకట్టుకున్నాయి.

ఆగస్టులో గ్రూప్-2

- పరీక్షకు వారం ముందు నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ : టిఎస్‌పిఎస్‌సి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గ్రూప్-2 రాతపరీక్షల తేదీలను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎస్‌పిఎస్‌సి) ఖరారు చేసింది. ఆగస్టు 29,30 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలను నిర్వహిస్తున్నట్టు టిఎస్‌పిఎస్‌సి కార్యదర్శి అనితా రామచంద్రన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష నిర్వహణకు వారం రోజుల ముందు నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 18 శాఖల్లో 783 పోస్టుల భర్తీకి గతేడాది డిసెంబర్ 29న టీఎస్‌పీఎస్సీ ప్రకటించిన గ్రూప్-2 నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 5,51,943 దరఖాస్తులొచ్చాయని అధికారులు వివరించారు. అంటే ఒక్కో పోస్టుకు 705 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. గ్రూప్-1 మెయిన్స్ రాతపరీక్షలు జూన్ ఐదు నుంచి జరుగుతాయి. జులై ఒకటో తేదీన గ్రూప్-4 పరీక్షలుంటాయి. గ్రూప్-3 రాతపరీక్షల తేదీలను త్వరలోనే ప్రకటించే అవకాశమున్నది. ఇతర వివరాలకు https://www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

8న విద్యాశాఖ కార్యాలయం ముట్టడి

- డిఎడ్, బిఎడ్ అభ్యర్థుల సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 15 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలంటూ ఈ నెల ఎనిమిదో తేదీన పాఠశాల విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్టు రాష్ట్ర డిఎడ్, బిఎడ్ అభ్యర్థుల సంఘం ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీనునాయక్, కార్యవర్గ సభ్యులు నరేష్, హరీశ్, భాను, కోటేష్, ఇర్ఫాన్, చంద్రశేఖర్‌రెడ్డి, మౌనిక, కవిత, స్వప్న మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయ ఖాళీలకు ఆర్థిక శాఖ వెంటనే అనుమతిచ్చి, టిఆర్‌టి నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతేడాది జూన్ 12న టెట్ నిర్వహించి తొమ్మిది నెలలు గడిచిందని ఆందోళన వ్యక్తం చేశారు. అయినా టీఆర్టీ నోటిఫికేషన్ జారీ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని తెలిపారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులంటూ కాలయాపన చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలతో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ నిలిచిపోయిందని వివరించారు. అది పూర్తయ్యేసరికి మరింత ఆలస్యమవుతుందని తెలిపారు. దీంతో ఉపాధ్యాయ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు.

శ్రీ చైతన్య కాలేజీపై చర్యలు తీసుకోవాలి

- ఎంపి కోమటిరెడ్డి వెంకటరెడ్డి డిమాండ్
- నార్సింగి శ్రీ చైతన్య కాలేజీ ఎదుట నిరసన దీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న శ్రీ చైతన్య కాలేజీపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎంపి కోమటిరెడ్డి వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం రంగారెడ్డి జిల్లా నార్సింగిలోని శ్రీచైతన్య కాలేజ్ ఎదుట దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి సాత్విక్ మరణానికి కారణమైన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో చైతన్య, నారాయణ కాలేజీల వ్యాపారాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రయివేట్ కాలేజీల ఆగడాలపై చర్యలు తీసుకోకపోవడంతోనే ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయని అన్నారు. ఏడు వేల స్కూల్స్ మూతపడినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ కాలేజీలు, స్కూళ్లను కాపాడకుండా శ్రీ చైతన్య, నారాయణ కాలేజ్‌లను ప్రోత్సహిస్తుందన్నారు. రాష్ట్రంలో స్కూల్స్, కాలేజీలను ప్రయివేటుకు అప్పజెప్పేందుకు కుట్ర చేస్తుందని ఆరోపించారు. ర్యాంకుల కోసం శ్రీ చైతన్య కాలేజీ వ్యాపారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు శ్రీ చైతన్య కాలేజ్ యాజమాన్యానికి అమ్ముడుపోయినట్టు మాట్లాడుతున్నారని ఆరోపించారు. పోలీసు వ్యవస్థ ఉన్నదా లేదా అనుమానం కల్గుతుందన్నారు. విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవద్దని సూచించారు. విద్యార్థులు ప్రయివేట్ కాలేజీల్లో కాకుండా ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదువుకోవాలన్నారు. బ్రాంచీల పేరుతో వేల కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్నారన్నారు. ట్విట్టర్‌లో స్పందించే ప్రభుత్వం. నగరానికి పక్కనే ఉన్న నార్సింగ్ కాలేజీకి వచ్చి విచారణ చేయాలన్నారు. రాష్ట్రంలో హోమ్ మినిస్టర్, పోలీస్ శాఖ లేనట్టేనని, పోలీసులు శ్రీ చైతన్య కాలేజీకి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా మంత్రి కెటిఆర్, సిఎం కెసిఆర్ స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బిఆర్‌ఎస్ దొంగ ధర్నాలు

- మాజీ మంత్రి పుష్పలీల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెరిగిన సిలిండర్ ధరను నిరసిస్తూ... రాష్ట్రంలో బిఆర్ఎస్ దొంగ ధర్నాలు చేస్తున్నదని టిపిసిసి నేత, మాజీ మంత్రి పుష్పలీల ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ హయాంలో సిలిండర్ ధర రూ. 400 ఉండేదని, కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక అది రూ. 1155కు చేరిందని విమర్శించారు. పెరుగుతున్న ధరలను నియంత్రించడంలో కేంద్రం పూర్తి విఫలమవుతున్నదని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలు నీలిమా, కల్వ సుజాతతో కలిసి ఆమె విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల్ని మోసం చేస్తున్నాయని విమర్శించారు. బంగారు తెలంగాణ అని చెప్పే కెసిఆర్ ఇప్పుడు ధర్నాల పేరుతో డ్రామా ఆడుతున్నారని చెప్పారు. కట్టెలతో వంట చేసే పరిస్థితి మళ్లీ వచ్చిందని, రాష్ట్రంలో ఎక్కడ చూసినా ప్రజలకు న్యాయం జరగడం లేదన్నారు. మహిళలకు రక్షణ లేకుండాపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ పార్టీ అన్ని రాష్ట్రాల్లో ధర్నాలు చేయకుండా ఇక్కడే చేస్తున్నారని ఎద్దేవా చేశారు. డాక్టర్ ప్రీతి ఆత్మహత్య అంశాన్ని చిన్నదిగా చూపించడం సరైందికాదని, ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రీతి కుటుంబానికి న్యాయం చేస్తాం : తరుణ్‌చుగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సీనియర్ వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకున్న వరంగల్ వైద్య విద్యార్థిని ప్రీతి కుటుంబానికి న్యాయం చేసేందుకు కృషిచేస్తామని బిజెపి రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ తెలిపారు. గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రీతి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటన ద్వారా రాష్ట్రంలో విద్యార్థులకు, మహిళలకు భద్రత లేదన్న విషయం స్పష్టమవుతున్నదని పేర్కొన్నారు. కెసిఆర్ ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పుల చెల్లింపులో తీవ్ర జాప్యం చేస్తోందని విమర్శించారు. కళాశాలలో ర్యాగింగ్‌పై పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో దళితులు, వెనుకబడిన కులాలు, మహిళలు, రైతులు, విద్యార్థులపై కెసిఆర్ ప్రభుత్వం వివక్ష చూపిస్తోందని విమర్శించారు. బంగారు తెలంగాణ హామీతో అధికారంలోకి వచ్చిన కెసిఆర్, ఆయన కుటుంబం అవినీతిలో కూరుకుపోయిందని పేర్కొన్నారు. ప్రీతి మృతి ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి, బాధిత కుటుంబానికి వీలైనంత త్వరగా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.